క్లుప్తంగా

డంపింగ్ యార్డుల పరిశీలన



వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పోరుమామిళ్ల : మండలంలోని పంచాయతీల్లో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ రమణారెడ్డి పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ, హరిత రాయబారుల చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీకి తీసుకుంటున్న చర్యలు ఎంపీడీఓ పరిశీలించారు. అన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ చేపట్టాలని, పంచాయతీల ఆదాయానికి కార్యదర్శులు కృషి చేయాలని ఆయన కోరారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

అట్లూరు : రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతుల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం బద్వేలు అర్బన్ రైతు సేవా కేంద్రంను ఆయన తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని రైతులకు ఈ విషయాన్ని వివరించి వారు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

అన్నదానం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దేవస్థాన సన్నిధిలో గల శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నసత్రంలో వీరభద్రస్వామి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ మాట్లాడుతూ ప్రతి సోమవారం భక్తుల సౌకర్యార్థం దాత సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతు సుబ్రహ్మణ్యం, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి చెందిన నవీన్, నమ్రతల వివాహం మహోత్సవం సందర్భంగా వారి సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. 800 మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారన్నారు. ప్రతి సోమవారం తమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం : మండల వ్యాప్తంగా ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలంలో మంచినీటి సమస్యలు తలెత్తే గ్రామాల్లో ముందుస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమేష్‌బాబు, ఏఈలు వెంకటేష్, సుధీర్, నాగజ్యోతి, ఈఓపీఆర్డీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన కమిషనర్

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. జిన్నా రోడ్డులో రోడ్డు స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్తపాయింట్‌ను శుభ్రం చేయించాలని శానిటేషన్ సెక్రటరీని కమిషనర్ ఆదేశించారు. మోడంపల్లెలో ఇంటింటి చెత్త సేకరణను, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎల్లమ్మ గుడి వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీత పాల్గొన్నారు.

9న ఆర్యవైశ్యసభ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 9న ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్యసభకు దసరా రుసుం పెంపు విషయంపై చర్చించడం, అమ్మవారిశాలలోని నగరేశ్వరస్వామి సన్నిధిలో స్ఫటిక లింగం ఏర్పాటు, అమ్మవారికి రోజు ఉదయం 9.30 నుంచి 10.30 గంటలకు బంగారు పుష్పాలతో అర్చనపై చర్చ, గతంలో చేయించిన బంగారు, వెండి పుష్పాల అమ్మకంపై చర్చించుట, సభ ఎన్నిక నియామావళి తేదీలను మార్పు చేయు విషయం తదితర అంశాలపై చర్చిస్తారని వారు వివరించారు. ఆర్యవైశ్య సభ్యులందరు పాల్గొనాలని కోరారు.

పచ్చని పల్లెలపై మద్యం మహమ్మారి!

- ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటు
- బెల్టు షాపు ఏర్పాటుకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు డిమాండ్
- కలసపాడు మండలంలో అత్యధికం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



కోడూరులో బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేస్తున్న మద్యం ప్రియులు

బద్వేలు : పల్లెలు పచ్చని పైర్లతో.. పొలం పనులతో కళకళలాడాల్సిన సమయం. ఇంటికి గొళ్లెం పెట్టి పిల్లాపాపలతో పొలం పనులతో క్షణం తీరిక లేకుండా ఉండాల్సిన పల్లెలు.. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గత ఏడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి మద్యం షాపులు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టింది. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన మద్యం షాపులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పుణ్యామా అని పల్లె ముంగిటకు బెల్టు షాపుల రూపంలో చేరాయి. ప్రశాంతంగా పచ్చటి పంట పొలాలతో ఎల్లప్పుడూ కన్పించే పల్లెలు ఇప్పుడు మద్యం వ్యాపారం వచ్చి చేరడంతో ఎప్పుడూ గొడవలకు నెలవుగా పల్లెలు మారిపోయాయి. మండలానికి ఒక మద్యం షాపును మంజూరు చేసిన ప్రభుత్వం వాటిపై నియంత్రణ లేకపోవడంతో ఊరూరా వాటికి అనుబంధంగా బెల్టు షాపులు ఏర్పడాయి. మద్యం దుకాణాలు మంజూరు సమయంలో గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. బెల్టు షాపులు పెడితే వారి తాటతీస్తాం.. ఎంఆర్‌పీ రేట్లకు మించి విక్రయించినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటాం.. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, నాయకులు జోక్యం చేసుకోవద్దు అంటూ ఉత్తర ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఊరూరా అనధికారికంగా ఏర్పాటైన బెల్టు షాపులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన అమ్మకాన్ని బట్టి ఒక్కో బెల్టు షాపుకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు డిపాజిట్లు వసూలు చేశారు. ఒక్కో మద్యం సీసాపై రూ. 50ల నుంచి రూ.100ల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ ఆదేశాలు అటు నాయకులు.. ఇటు అధికారులు గానీ లెక్క చేయడం లేదు. కలసపాడు మండలంలో అధికారికంగా 2 మద్యం దుకాణాలు మంజూరు చేయగా వీటికి అదనంగా పల్లెలో దాదాపు 30 బెల్టు షాపులు ఏర్పాటు చేసినట్లు విమర్శలు హోరెత్తుతున్నాయి.

రేట్లు నిర్ణయించి అనుమతులు

లైసెన్స్ మద్యం దుకాణాలకు అనుబంధంగా గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన బెల్టు దుకాణాలకు కూడా రేట్లు నిర్ణయించి వేలాది రూపాయలు డిపాజిట్ల రూపంలో దండుకుంటున్నారు. బి.కోడూరు మండలంలో దాదాపు 20 బెల్టు షాపులు ఏర్పాటు చేయగా అందులో రాజుపాలెం గ్రామంలోని బెల్టు దుకాణం రూ.70 వేలు వసూలు చేసినట్లు సమాచారం. అలాగే మేకవారిపల్లె గ్రామంలో రూ.40 వేలు వసూలు చేసి బెల్టు దుకాణం ఏర్పాటుకు మద్యం షాపు యజమానులు అనుమతించినట్లు తెలిసింది. బి.కోడూరు మండలంలో ఊరూరా రెండు మూడు బెల్టు దుకాణాలు తెరిచినట్లు తెలుస్తోంది. బద్వేలు నియోజకవర్గంలో 7 మండలాల్లో దాదాపు 200కు పైచిలుకు బెల్టు దుకాణాలు ఉన్నట్లు వినికిడి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో మద్యం ఊసే లేకుండా ప్రశాంతంగా ఉన్న పల్లెలు మళ్లీ మద్యం మహమ్మారి వ్యాపించడంతో మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మగవాళ్లు సంపాదించిందంతా సాయంత్రానికి మందుకే తగలేస్తున్నారని వాపోతున్నారు. మద్యం మత్తులో పనులకూ వెళ్లడం లేదని ఇళ్లలో గొడవలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న దుకాణాల్లో మాత్రమే మద్యం లభిస్తుండడం.. బెల్టు షాపుల ఊసే లేకపోవడంతో మద్యానికి దూరంగా ఉన్నవాళ్లు కూడా బెల్టు షాపుల పుణ్యామా అని మళ్లీ మత్తులో మునిగి తేలుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కలసపాడు పట్టణంలో అయితే తెల్లవారుజామున 5 గంటలకే దాదాపు మూడు నాలుగు వేల రూపాయల మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కలసపాడు పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో మద్యం దందా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

స్పందించని అధికారులు

మద్యం మత్తులో బద్వేలు నియోజకవర్గంలో గొడవలు జరగని గ్రామమంటూ లేదు. ఇంత జరుగుతున్నా.. పోలీసులు గానీ.. ఎక్సైజ్ అధికారులు గానీ అటువైపు కన్నెత్తి సైతం చూడడంలేదు. కాసులకు కక్కుర్తి పడుతున్న ఎక్సైజ్ పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే అపవాదు అధికారులు మూటగట్టుకుంటున్నారు. రెస్టారెంట్లల్లో.. బెల్టు షాపుల్లో మద్యం అన్నివేళలా అందుబాటులో ఉన్నట్లు తెలిసినా అధికారులు తూతూమంత్రంగా తనిఖీకి వచ్చే సమయానికి వాటిని మూసిపెడుతున్నారని అంతేగాకుండా అధికారులే బెల్టు నిర్వాహకులకు ముందుస్తు సమాచారం ఇచ్చి తనిఖీలు చేస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపుల నిర్వహకులపై రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి

మైదుకూరు : వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ భూమిపై నివసిస్తున్న ప్రతి ప్రాణికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ప్రాణి విశిష్టమైనదని, వాటిని గుర్తించి సంరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సి. నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక రకాల వన్యప్రాణులు, వనస్పతుల గురించి అవగాహన కల్పించడం, వాటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడం, వన్యప్రాణుల అక్రమ వ్యాపారాన్ని నిరోధించి జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం కోసం ఏటా మార్చి 3న వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అయ్యవారిరెడ్డి, రాధా రామ్, నవనీశ్వర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అనురాధ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



టైలరింగ్ సెంటర్ ప్రారంభిస్తున్న విజయ ప్రతాప్‌రెడ్డి

పోరుమామిళ్ల : మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రయాన్స్ టైలరింగ్ సెంటర్‌ను సోమవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథాశ్రమం, ఆసుపత్రి, రూ.5లకే భోజనం, మహిళలకు వడ్డీలేని రుణాలు తదితర సేవా కార్యక్రమాలతో ముందుకు పోతున్న మదర్ థెరెసా ఫౌండేషన్ మరో అడుగు ముందుకేసి టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఈ కేంద్రంలో శిక్షణ పొంది ఆరు నెలల తరువాత ఉచితంగా కుట్టుమిషన్ అందుకొని, స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ యాజమాన్యం చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఆరోగ్యరాణి, గిరి ప్రణీత్‌రెడ్డి, డాక్టర్ అమితారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, డాక్టర్ మౌనిక రెడ్డి, మాజీ ఎంపీటీసీ రోజిలమ్మ, ఎంపీటీసీ మహబూబ్‌పీరా, నాయకులు చాపాటి నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీరామరెడ్డి, తులసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



చాపాడులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు



అట్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగకుండా అంగన్వాడీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు దృష్టి సారించాలని, ఎక్కడైనా ఇలాంటి వివాహాలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అంగన్వాడీ వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు ప్రతిజ్ఞ చేసి, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : బాల్య వివాహాలను అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో బాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంతగానో అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక ప్రపంచంలో అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని ఇవి అరికట్టడానికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


క్రమబద్ధీకరణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : అభ్యంతరం లేని ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.30 పై సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, వీఆర్ఓలు, ప్లానింగ్ సెక్రటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పూర్తిస్థాయి ఇళ్లకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారని తెలిపారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, అయితే లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండకూడదని, అలాగే నాలుగు చక్రాల వాహనం కూడా ఉండరాదని తెలిపారు. అంతేకాకుండా చెరువు పోరంబోకులు, లేఅవుట్ స్థలాలలో నిర్మించిన ఇళ్లకు క్రమబద్ధీకరణ అవకాశం లేదని, అలాగే ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు నిర్మించిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, క్రమబద్ధీకరణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ అధికారులకు సూచించారు. సమావేశంలో గోపవరం, బద్వేలు తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి

ప్రొద్దుటూరు క్రైం : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి కె సత్యకుమారి తెలిపారు.

మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ విషయమై సోమవారం పోలీసు అధికారులతో జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసులు సత్వర న్యాయ పరిష్కారం కోసం కక్షిదారులతో మాట్లాడి రాజీకి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ ఫైజున్నీసా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్ హారిక, డీఎస్పీ భావన, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

గోపవరం : ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలపెంట నరసింహులు ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన, స్టాకు నిల్వ, ధరల పట్టిక, వే బిల్లులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఎరువుల బస్తాల తూకాలు పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని, కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు ఎరువులు విక్రయించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయని డీలర్లను హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి

- త్వరలో కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని రాచమల్లు ఇంటికి సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీ పదవులు పొందిన వారిని రాచమల్లు.. రవీంద్రనాథ్‌రెడ్డికి పరిచయం చేశారు. అనంతరం రాచమల్లు మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి త్వరలో పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అన్ని కులాల వారికి ప్రాధాన్యం ఇస్తూ పార్టీ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు నిరంతరం సిద్ధంగా ఉన్నామన్నారు. యువతతోపాటు అనుభవం, పార్టీ పట్ల నమ్మకస్తులైన వారిని కలుపుకొని నియమించడం జరిగిందన్నారు. త్వరలో మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలతోపాటు పార్టీ పదవులు పొందిన వారితో కలిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లాకే ఈ సమావేశం మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు మిగిలిన 5 నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరవుతారన్నారు. పార్టీ ఓటమి అనంతరం కార్యకర్తలకు ఏమైనా ఇబ్బందులు జరిగాయా, పోలీసుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా అనే విషయాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత ఇబ్బందులను తెలుసుకుని వారికి మానసిక ధైర్యాన్ని కల్పిస్తామన్నారు. రెండో మారు వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా కార్యకర్తలకు ఎక్కడ భంగం కలిగిందో, ఆ గౌరవాన్ని, ఆనందాన్ని తిరిగి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అన్నిటికంటే పార్టీ క్యాడర్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాపీర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మార్తల చంద్ర ఓబుళరెడ్డి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

కందులు వెనక్కి పంపిన అధికారులు

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న వేర్ హౌసింగ్ గోడౌన్ అధికారులు నాణ్యత లేవని కందుల బస్తాల లోడ్‌తో లారీలను సోమవారం వెనక్కి పంపారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వం సేకరించిన కందులను లారీల్లో లోడ్ చేసి ఇక్కడికి నిల్వ చేసేందుకు తీసుకొచ్చారు. మొత్తం 18 లారీల్లో కందుల బస్తాల లోడ్లు రాగా 8 లారీలను వెనక్కి పంపినట్లు తెలిసింది. ప్రభుత్వం సేకరించిన కందుల బస్తాలను ఇక్కడి ప్రభుత్వ అధికారులే వెనక్కి పంపడం ఆశ్చర్యంగా ఉంది. పూర్తి సమాచారం కోసం అధికారులను సంప్రదించగా వారు స్పందించలేదు. గత కొద్ది రోజులుగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం క్వింటాలు రూ.7,550 చెల్లించి కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే.

బడ్జెట్‌లో విద్యార్థి, యువతకు అన్యాయం

పోరుమామిళ్ల : 2025–26 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 10.64% మాత్రమే కేటాయించి ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత ప్రేమ ఉందో తెలియజేసిందని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు అభిలాష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ విద్యారంగానికి చాలిచాలని కేటాయింపులు చేసి విద్యార్థులకు ద్రోహం చేశారన్నారు.

మహిళా ఉద్యోగుల బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహిళా ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ హైమావతి, మెప్మా టీఈ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు బైక్ ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఆడ పిల్లలను రక్షిద్దాం – ఆడ పిల్లలను చదివిద్దాం నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

– ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ అరుణ కుమారి మాట్లాడుతూ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

కార్మికులకు, రైతులకు ఉపయోగం లేని బడ్జెట్



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పోరుమామిళ్ల : గత ప్రభుత్వంపై నిందలు, చంద్రబాబుపై పొగడ్తలు తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శనివారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఐటీయూ, రైతుసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్‌లో ప్రజలకు జరిగే ప్రయోజనం చెప్పలేకపోయారన్నారు. లోటు బడ్జెట్ రూ.79వేల 926 కోట్లు ఉందని చెప్పారని, ఆ లోటు ఎలా పూడుస్తారో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. కార్మికుల, రైతుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని, పరిశ్రమల ఊసు లేదని, నిరుద్యోగ భృతి కల్పించలేదని, రైతులకు పెట్టుబడి సాయం లేదని, హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం లేదని, పంటలకు గిట్టుబాటు ధరలేదని, బ్యాంకు రుణాల గురించి ప్రస్తావన లేదని, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేవని భైరవప్రసాద్ విమర్శించారు. ధర్నాలో ఆయా సంఘాల నాయకులు నరసింహ, రవి, గురయ్య, ఓబులయ్య, బీబీ, మేరి, వెంకటలక్షుమ్మ, దస్తగిరమ్మ, రహమత్, ఫాతిమా, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

75 మంది విద్యార్థులు గైర్హాజరు



పరీక్ష కేంద్రం వద్ద రూం నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



మోడంపల్లె ఉర్దూ హైస్కూల్‌లో ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ షంషుద్దీన్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, భావన, దీప్తి, అభ్యాస్, శ్రీవిద్య, గీతం, విజ్ఞాన్, నారాయణ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 1954 మంది విద్యార్థులకు గాను 1879 మంది హాజరవ్వగా, 75 మంది గైర్హాజరయ్యారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

పట్టణంలోని పలు ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీఈఓ షంషుద్దీన్ పరిశీలించారు. మోడంపల్లె ఉర్దూ హైస్కూల్, నారాయణ హైస్కూల్, కొత్తకొట్టాల ఉర్దూ హైస్కూల్‌లను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కొత్తకొట్టాల ఉర్దూ హైస్కూల్‌లో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మానవతా దృక్పథంతో పరీక్షలకు అనుమతించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు



హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా హోటళ్లలో ప్లేట్లపై, పార్శిల్‌లకు, ఇడ్లిపాత్రలలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండటం గమనించి సంబంధిత హోటల్ యజమానులకు హెచ్చరికలు జారీ చేయడంతోపాటు పోరుమామిళ్ల రోడ్డులోని ఓ హోటల్ నిర్వాహకుడికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లలో ప్లేట్లలో, ఆహార పదార్థాలు పార్శిల్ చేయడానికి ప్లాస్టిక్ కవర్లకు బదులుగా విస్తరాకులు గాని అరటి ఆకులు గాని వాడాలని సూచించారు. శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలోని హోటళ్లను తరచూ తనిఖీలు చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.